సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం : 15 : జూన్ : 2024



త్యాగానికి ప్రతీక బక్రీద్
ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగల్లో బక్రీద్ ఒకటి. త్యాగానికి ప్రతీకగా చెప్పకునే పండుగను ఈ నెల 17న జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. -8లో



బాలింత మృతిపై ఆందోళన
చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మంజుల జ్యోతి అనే బాలింత మృతి చెందింది. ఆమె మృతిపై బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.560	రూ.640
రెండోరకం	రూ.400	రూ.540

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 657 మెట్రిక్ టన్నులు





న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె: మండలంలోని గ్యారంపల్లె ఆంధ్ర ప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ లెక్చరర్ పోస్టులకు సంబంధించి ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థులు తాత్కాలిక ఫుల్‌టైం గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 20వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. నెలసరి జీతం రూ. 18 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇసుక రీచ్ తనిఖీ



ఇసుక రీచ్ వద్ద అధికారులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ పాపాఘ్ని నదిలోని రామాపురం వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను శుక్రవారం పలు శాఖల అధికారులు తనిఖీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారానికోసారి జిల్లాలోని రీచ్‌లను తనిఖీ చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూగర్భగనుల శాఖ ఏడీ పెద్దారెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) సీఐ రాంమోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో యోగానంద్, ఇరిగేషన్ ఏఈ వాసుదేవ పిళ్లై, స్థానిక వీఆర్వో అనీషా, వీఆర్వో ఖాదర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి సురేంద్రబాబులు పాల్గొన్నారు.

గుర్తింపులేని కళాశాలల్లో పిల్లలను చేర్పించవద్దు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల తల్లితండ్రుల తమ పిల్లలను గుర్తింపు లేని ఇంటర్మీడియట్ కళాశాలల్లో చేర్పించవద్దని ఇంటర్ ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గుర్తింపు లేని కళాశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే ఆర్‌ఐవో ఆఫీసుకుగానీ, ఇంటర్ విద్యామండలికానీ బాధ్యత వహించదని చెప్పారు. వివిధ కోర్సులు, మెటీరియల్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నటు ఫిర్యాదులు అందితే ఆ కళాశాలల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వచ్చేనెల 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జులై 29 నుంచి ఆగస్టు 3 తేదీ వరకు సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 25న నోటీసులు అందుకున్న కక్షిదారులు కడపలోని న్యాయసేవాసదన్‌లో శనివారం జరుగబోయే ముందస్తు లోక్ అదాలత్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

డ్రైవర్లకు ఆరోగ్యం ముఖ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు ఆరోగ్యకరంగా ఉంటూ మానసిక ఒత్తిడిని తగ్గించే మార్గాలను అనుసరించాలని ఆర్టీసీ కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. కడప నగరంలోని ఆర్‌ఎం కార్యాలయ సభా భవనంలో విధులకు గైర్హాజరయ్యే సిబ్బంది, దీర్ఘకాలిక సెలవులో ఉన్న వారు, ప్రమాదాలు చేస్తున్న సిబ్బందికి రిమ్స్ మానసిక వైద్యుల ద్వారా మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో డ్రైవర్లు కీలకంగా ఉంటారన్నారు. అలాంటి డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు.

సిద్దవటం కోట గేటు తాళాలు ఇవ్వాలి

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని కోట గేటు తాళాలు ఇవ్వాలని పరకోటలో ఉన్న బిస్మిల్లా షా ఖాద్రి దర్గా మోజన్ సలీం ఖాద్రి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ తన పూర్వీకుల నుంచి పరకోటలో నివాసం ఉంటున్నామన్నారు. సాయంత్రం 6 గంటలకు కోట సిబ్బంది ప్రధాన గేటుకు తాళాలు వేసి వెళుతున్నారని, పరకోటలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని వాపోయారు. గతంలో ఉన్న వారు తనకు ఒక సెట్టు తాళాలు ఇచ్చారన్నారు. గత ఏడాది డిసెంబర్ 31న కోటలో పనిచేసే సిబ్బంది సుబ్రమణ్యం పాత తాళాలను మార్చి కొత్తవి చేయించారని, అయితే తనకు ఒక సెట్టు తాళాలు ఇవ్వలేదని తెలిపారు. భార్య, 8 ఏళ్ల కుమార్తెతో కలిసి ఇక్కడ ఉంటున్నామన్నారు. రాత్రి వేళల్లో పాములు తిరుగుతుంటాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. పురాతత్వ సర్వేక్షణ అధికారులు స్పందించి కోట గేటుకు సంబంధించిన ఒక సెట్టు తాళాలు ఇప్పించాలని విన్నవించారు.

చదువు కొనాల్సిందేనా!

- ఫీజులు పెంచేసిన కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లు
- పుస్తకాల పేరిట అదనపు దోపిడీ
- తల్లిదండ్రులపై మరింత భారం



మదనపల్లె సిటీ: జూన్ వచ్చిందంటే తల్లిదండ్రులకు టెన్షన్ మొదలవుతోంది. ప్రైవేటు బడుల దోపిడీకి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్కడ చదువు కొనాలంటే వేలకు వేలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిడ్డ భవిష్యత్తు కోసం తమ జీవితాలను అప్పులపాలు చేసుకోవాల్సి వస్తోంది. పేరెంట్స్ బలహీనతను ఆధారంగా చేసుకుని ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్నాయి. పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ పేరిట అందినకాడికి యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

- జిల్లాలో కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే రోజులు పోయి చెదువుకొనాల్సిన రోజులు వచ్చాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులు చేర్పించేందుకు వెళుతున్న తల్లిదండ్రులు ఫీజుల వివరాలు తెలుసుకుని బెంబేలెత్తిపోతున్నారు. నర్సరీలో చేర్పించాలంటే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫామ్ తదితర ఖర్చులకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవసరమవుతోందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్య కారణంగా జూన్ వచ్చిందంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు హడలెత్తిపోతున్నారు.

బడులు ప్రారంభం

జిల్లాలో గురువారం నుంచి బడులు పునః ప్రారంభమయ్యాయి. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలవారు ఫీజుల పేరుతో దోచుకునేందుకు సిద్ధమయ్యారు. డబ్బే పరమావధిగా భావించి తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలు మొదటి టర్మ్ ఫీజులు సైతం వసూలు చేసేశాయి. మరికొన్ని టెక్నో,ఐఐటీ, ఒలింపియాడ్ అంటూ ఎక్కువ ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. దీంతో ఏటా విద్యా ఖర్చు తల్లిదండ్రులకు మోతెక్కిపోతోంది. ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు,బ్యాగులు, క్యారేజీ బ్యాగులు, బూట్లు,యూనిఫామ్, బస్సు రవాణాకు చెల్లించాల్సిన డబ్బు అదనంగా ఖర్చవుతోంది. ఈ ఏడాది కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు 15 నుంచి 25 శాతం వరకు పెంచేశారు. పాఠ్యపుస్తకాల ధరలు సైతం 20 నుంచి 25 శాతం పెరిగాయి. విద్యా సంస్థలల బస్సుల ఫీజులు సైతం గత ఏడాది కంటే రూ.750 పెంచేశారు.




1 నుంచి 5 తరగతి విద్యార్థుల పుస్తకాల ధరలు: రూ. 6 వేల నుంచి 8 వేలు వరకు

6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు: రూ. 8 నుంచి 10 వేలు వరకు



యూనిఫాం మూడు జతలు: రూ.15 నుంచి 2 వేలు వరకు



షూ, టై, బెల్ట్ తదితర వస్తువులు: రూ.500 నుంచి 1000 వరకు

ఫీజుల వివరాలు అంచనా ఇలా....

తరగతి	ఫీజు (రూ.వేలల్లో)
ఎల్‌కేజీ, యూకేజీ	15 నుంచి 25
ఒకటి నుంచి 5 వరకు	25 నుంచి 40
6 నుంచి 10 వరకు	35 నుంచి 50

ప్రైవేటు వలలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లీష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టింది. విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించింది. అయినప్పటికీ చాలా మంది తల్లిదండ్రులు అనవసరంగా ప్రైవేటు పాఠశాలల వలలో చిక్కుకుంటున్నారు. అక్కడ ఏదో చెప్పేస్తారు.. తమ పిల్లలకు ఏదో నేర్పించేస్తారనే అపోహతో అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. చివరకు అప్పుల పాలవుతున్నారు.

కార్పొరేట్ బాటలో...

కార్పొరేట్ సంస్థలను చూసి సెమీ కార్పొరేట్, కొన్ని ఏ గ్రేడ్ ప్రైవేటు పాఠశాలలు సైతం ఫీజులను పెంచేశాయి. ఈ క్రమంలోనే ముందస్తుగానే ఫీజు కట్టించుకుంటున్నాయి. చాలా వరకు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలు కాకుండా సొంత పుస్తకాలు అమ్మడం మొదలు పెట్టారు. విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఫీజులు



విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కార్పొరేట్ యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఏడాది కంటే అధికంగా ఫీజులు పెంచేశారు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళనలు చేపడతాం. -మాధవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు

నోటీసు బోర్డులో పెట్టాలి



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు స్కూల్ నిర్వాహకులు ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. అయితే ఎక్కడా పెట్టడం లేదు. రూ.లక్షలకొద్ది ఫీజులను తల్లిదండ్రుల నుంచి వసూలు చేసుకుంటున్నారు. ఇవి తెలిసినా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు.
-సాయిహితేష్, ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: ఈ నెల 17న బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో బక్రీద్ సందర్భంగా హిందూ, ముస్లిం మతపెద్దలు, వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా మతసామరస్యానికి ప్రతీక అని ఆయన అన్నారు.సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. రాయచోటి పట్టణంలో ఉన్న జంతు వధశాలల్లో నీటి సమస్య రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణంలోని 34వ వార్డులోని డ్రైనేజీ కాలువల్లో చెత్త పేరుకుపోయిందని, డ్రైనేజీ నీరంతా రోడ్లపైకి వస్తోందని, సమస్య పరిష్కరించాలని 34వ వార్డు ముస్లిం మతపెద్దలు జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని జేసీ మున్సిపల్ అధికారులకు తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి మండిపల్లి రాక



రాయచోటి: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. శనివారం ఉదయం విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి కడప ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా రాయచోటికి రానున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఆయన తొలిసారి జిల్లాకు రానుండటంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, అనుచరులు, ప్రజలు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

రాయచోటి టౌన్: రాష్ట్ర క్రీడల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో క్రీడలలో పూర్వపు తీసుకొస్తామని జిల్లా హాకీ హాకీ సమాఖ్య సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరావు, జిల్లా ఉపాధ్యక్షులు డి. నరసింహాచారి, గౌరవాధ్యక్షులు శివప్రసాద్ నాయుడు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మంత్రి సహకారంతో హాకీతో పాటు, వాలీబాల్, క్రికెట్ వంటి అనేక రకాల ఆటల ద్వారా యువతను అభివృద్ధి దిశగా తీసుకెళతామని చెప్పారు.

సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

గుర్రంకొండ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుర్రంకొండలోని స్టూడెంట్ కిట్స్ నిల్వ ఉంచిన గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల్లోగా అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రణాళిక ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. కొత్తగా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. క్రమ శిక్షణతో కూడిన విద్యనందించాలని చెప్పారు. అనంతరం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. వేసవి సెలవుల్లో ఏయే పుస్తకాలు చదివారో విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఉపాధ్యాయులను అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సురేంద్ర బాబు, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడౌన్‌లో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి

ఎన్నికల విజయవంతంలో మీ కృషి భేష్

అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్



ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు జ్ఞాపికలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాన్ని ప్రణాళికతో శాంతియుతంగా నిర్వహించి విజయవంతం చేయడంలో అధికారుల కృషి ఎనలేనిదని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎస్పీ బి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ అభినందన సభ (సక్సెస్ మీట్) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పొప్పులు మొదలుకొని, కౌంటింగ్ ముగిసే వరకు సంబంధిత అధికారులు సమష్టి కృషితోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతం అయిందన్నారు. జిల్లాకు రాగానే ఎన్నికల నగరా మొదలైన నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎన్నికల విధులను అధికారులకు అప్పగించామన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువ మానవ వనరులు ఉన్నా సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించామన్నారు. రిటర్నింగ్ అధికారులు అన్ని టీమ్‌లలో నోడల్ అధికారులు, లైజన్ అధికారులు, మండల తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సాంకేతిక సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల విధుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం చేసిన కృషిని అబ్జర్వర్లతోపాటు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం కూడా అభినందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ కృష్ణారావు పక్కా బందోబస్తు ప్రణాళికతో పోలీస్ యంత్రాంగం కృషి చేసిందని ఈ సందర్భంగా పోలీసు అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతాభినందలలు తెలియపరిచారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సజావుగా సహకరించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులు, మీడియా మిత్రులు, ఎన్నికల పరిశీలకులు, ప్రజలు ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పోలీసు శాఖలోని కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు, అదనపు ఎస్పీ వరకు అందరూ శక్తివంచన లేకుండా సహకరించారని, ఇందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేషన్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ గత ఫిబ్రవరి మాసం నుంచి అధికారులందరూ కొత్త ఎనర్జీతో ఎన్నికల ఒరవడిని సాహసోపేతంగా నిర్వహించారన్నారు. అంతకు ముందు అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, ఆర్డీఓలు రంగస్వామి, హరిప్రసాద్, సిరికల్చర్ డీడీ రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఎదుర్కొన్న అనుభవాలు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల సూపరిటెండెంట్ నరసింహారావు పాడిన పాటలు అందరినీ అలరించాయి. అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొన్న జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రం, మెమెంటోలను జిల్లా కలెక్టర్ అందజేశారు. అలాగే జిల్లా కలెక్టర్‌ను జిల్లా అధికారుల బృందం సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

పరిశోధనలు ఎప్పుడో!

- అభివృద్ధికి నోచుకోని ఉద్యాన పరిశోధన కేంద్రం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.50లక్షలతో ప్రహరీ నిర్మాణం
- కొత్త ప్రభుత్వం స్పందిస్తే రైతులకు ప్రయోజనం



ఉద్యాన పరిశోధనా కేంద్రం కార్యాలయం



కేంద్రం చుట్టూ నిర్మించిన ప్రహరీ

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని ఆంధ్రా ఊటీ హార్సిలీకొండ దిగువన బయ్యప్పగారిపల్లె-కోటావూరు గ్రామాల సరిహద్దుల్లో 2018లో ఉద్యానవన పరిశోధనా కేంద్రాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక శాస్త్రవేత్తను నియమించగా విధుల నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో అప్పటినుంచి ఈ కేంద్రం అభివృద్ధికి నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారం చేపట్టడంతో దీనిని అభివృద్ధి బాట పట్టించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- రాయలసీమ ప్రాంతంలో పండ్ల, పూలతోటలపై పరిశోధనల కోసం బి.కొత్తకోట మండలంలో ఉద్యానవన పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తూ 2018 మే 2న గత టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో ఈ కేంద్రం పనిచేస్తుంది. ఇందుకోసం కోటావూరు, బయ్యప్పగారిపల్లె పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ డీకేటీ, పట్టా భూములు 88.89 ఎకరాలను సేకరించారు. రూ.4,13,63,114 పరిహారాన్ని మంజూరు చేయగా చర్యల కోసం విశ్వవిద్యాలయం 467 నంబర్‌తో తీర్మానం చేసింది. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లోనే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం కోసం ప్రతిపాదనలను పంపి, దానికయ్యే ఖర్చును నివేదించాలని ఉత్తర్వుల్లో అధికారులను కోరారు. అయితే సేకరించిన భూముల్లో కోటావూరు గ్రామానికి చెందిన 17.40 ఎకరాలు, బయ్యప్పగారిపల్లె గ్రామ పరిధిలోని 65.10 ఎకరాల డీకేటీ భూములు, 5.31 ఎకరాల ప్రభుత్వ భూమి, సరిహద్దులోని పట్టుపరిశ్రమశాఖకు చెందిన 1.08 ఎకరాలను కలుపుకొని 88.89 ఎకరాలకు భూ పరిహారం అందించే చర్యలు పూర్తి చేశారు. అంతటితోనే కేంద్రానికి సంబంధించిన పనులు ఆగిపోయాయి.

నిరుపయోగమైన భవనంలోని గదిలో కార్యాలయం

రాయలసీమ రైతాంగానికి ఎంతో ప్రయోజనమైన ఈ పరిశోధనా కేంద్రం ప్రారంభానికి గత టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా భవనాల నిర్మాణాలు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, పనిచేసే ఉద్యోగుల నియామకం కోసం అడుగులు ముందుకు పడలేదు. భూ పరిహారం కోసం మంజూరు చేసిన నిధులు మినహా కేంద్రం ఏర్పాటు కోసం నిధులు ఇవ్వలేదు. సీమజిల్లాలకు కీలకమైన ఈ కేంద్రం కోసం కనీసం ఒక కార్యాలయాన్ని నిర్మించలేదు. నియామకాలు చేపట్టలేదు. కేంద్రానికి ఎదురుగా ఉన్న ప్రాథమిక బీజక్షేత్రంలో నిరుపయోగమైన ఒక భవనంలోని ఓ గదిలో కార్యాలయం ప్రారంభించి అక్కడినుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. టీడీపీ హయాంలో ఒక శాస్త్రవేత్తను నియమించగా వైఎస్సార్‌సీపీ హయాంలో మరో ఇద్దరు శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించారు. స్వాధీనం చేసుకున్న భూమిని కాపాడుకోవడం కోసం విశ్వవిద్యాలయం కేంద్రం అమలు చేస్తున్న రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం నుంచి రూ.50లక్షలను మంజూరు చేసి ప్రహరీ నిర్మాణం చేపట్టింది.

ఘనమైన ఆశయం

ఇతర ప్రాంతాల్లోకంటే ఇక్కడ ఉష్ణోగ్రతలు తక్కువ. ఏడాదిలో అత్యధిక సమయం చల్లటి వాతావరణం ఉంటుంది. వాతావరణ పరిస్థితులు భిన్నం కావడంతో దీనికి అనుగుణంగా ఉద్యానవన పంటలకు సంబంధించి కొత్త వంగడాల సృష్టికి అనుకూలమని శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంవైపే మొగ్గుచూపారు. ఈ కేంద్రంలో అధిక దిగుబడులు సాధించే విధంగా విత్తనాభివృద్ధి కోసం పరిశోధనలు సాగిస్తారు. ఈ ప్రాంతంలో టమాట, బీర, కాకర, బీన్స్, వంకాయ కూరగాయ పంటల సాగు అధికం. ఇక్కడి వాతావరణానికి తట్టుకునే, తక్కువ రోగరహిత కలిగిన ఉద్యాన పంటలపై పరిశోధనలు చేస్తారు. రాయలసీమలో అధికంగా ఉద్యాన, పూలతోటల సాగు ఉన్నాయి. ఈ పంటలకు సంబంధించి ఏ పరిశోధనలు చేపట్టాలి, రైతులకు ఏ విధంగా ఉపయోగపడాలి అన్న అంశాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలను సాగిస్తారు. చీడపీడల నివారణ, అధిక దిగుబడులు సాధించడం, కొత్త వంగడాల సృష్టి కోసం పరిశోధనలు చేస్తారు. రైతులకు ఉద్యానవన పంటల సాగు మరింత ఆదాయం లభించే పంటలుగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యంగా సాగుతుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కేంద్రం అభివృద్ధిపై ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సుబ్బలక్ష్మి

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం గ్రామానికి చెందిన అన్నవరం సుబ్బలక్ష్మి (40) శుక్రవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నాగమురళి తెలిపిన వివరాల మేరకు.. ఎగువ రామాపురం గ్రామానికి చెందిన అన్నవరం శ్రీనివాసులుతో సుబ్బలక్ష్మికి పది సంవత్సరాల క్రితం వివాహమైంది. శ్రీనివాసులు తన సొంత ట్రాక్టర్‌ను నడుపుకొంటూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా ఆరోగ్యం సరిగా లేక పోవడంతో మనస్తాపానికి గురైన సుబ్బలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు 7 ఏళ్ల కుమార్తె ఉంది. మృతురాలి తమ్ముడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన ఇద్దరు మృతి



మృతి చెందిన నల్లమ్మ, నజీర్

చిన్నమండెం : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. కేశాపురం దేవలంపేట వద్ద కారు, బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ నల్ల మ్మను తిరుపతి ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందింది. అదే విధంగా మల్లూరు క్రాస్ వద్ద డివైడర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో నజీర్ తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యుత్ షాక్‌తో..


మురళి (ఫైల్)

కలికిరి : విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన దుర్ఘటన మండల కేంద్రమైన కలికిరి పట్టణం బీడీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కలికిరి బీడీ కాలనీలో ఓ ఇంటి పెయింటింగ్ పనికి గాను పీలేరు నుంచి నలుగురు పెయింటర్‌లు వచ్చి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పీలేరు మండలం బోడి మల్లవారిపల్లి పంచాయతీ మేకలవానికాల్వకు చెందిన మురళి (45) ఇంటి వెలివేషన్‌కు పెయింటింగ్ చేయడానికి.. పొడవైన రాడ్డుకు పెయింటింగ్ రోలర్‌ను అమర్చుకుని పని చేస్తున్నాడు. వెనుకవైపు ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లకు రాడ్డు తగలంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన తోటి పెయింటర్‌లు హుటాహుటిన కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య విజయకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజంపేట : రాజంపేట-హస్తవరం రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రేణిగుంట రైల్వేపోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

17న పండుగ జరుపుకోవాలని పిలుపు



కమలాపురం : ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో బక్రీద్ ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈద్-ఉల్-జుహ అని కూడా ఈ పండుగను పిలుస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ. ఈ నెల 10వ రోజున బక్రీద్‌ను ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకుంటారు. అల్లాహ్ ఆజ్ఞను తుచా తప్పకుండా పాటించడమే ఈ పండుగ అర్థం. ఈ నెల 17న బక్రీద్ జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు.

కన్న కొడుకునే త్యజించడానికి సిద్ధ పడిన హజరత్ ఇబ్రహీం

హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లా (స.హ.స) తన కన్న కొడుకు ఇస్మాయిల్ (స.హ.స.)ను త్యజించడానికి సిద్ధ పడ్డారు. హజరత్ ఇబ్రహీంకు తన 80వ ఏటా అల్లాహ్ సంతానాన్ని(హజరత్ ఇస్మాయిల్) ప్రసాదిస్తారు. ఇస్మాయిల్ స.హ.స. ఏడవ ఏట హజరత్ ఇబ్రహీం తన కుమారుడిని జుబాహ్ (గొంతు కోయడం) చేసినట్లు మూడు సార్లు కలలో చూస్తారు. దీన్ని అల్లాహ్ ఆజ్ఞగా భావించిన హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెబుతారు. ఈ విషయం విన్న ఇస్మాయిల్ ఆనందంగా తన గొంతు కోయాలని చెబుతారు. దీంతో హజరత్ ఇబ్రహీం తన కుమారుడిని అల్లాహ్‌కు సమర్పించేందుకు సిద్ధ పడతారు. ఇస్మాయిల్ గొంతుపై ఇబ్రహీం పదునైన కత్తి ఉంచి గొంతు కోసేందుకు మూడు పర్యాయాలు ప్రయత్నిస్తారు. అయితే అల్లాహ్ మహిమతో (హరజత్ ఇస్మాయిల్) గొంతు తెగదు. అదే సమయంలో అల్లాహ్ ఆజ్ఞతో ఆ ప్రాంతంలో పొట్టేలు సంతతికి చెందిన దుంబా అనే జంతువు ప్రత్యక్షం అవుతుంది. ఇస్మాయిల్‌కు బదులుగా దుంబాను జుబాహ్ చేయాలని, ఇది అల్లా ఆజ్ఞ అని అక్కడ ప్రత్యక్షమైన ఓ దేవదూత ఇబ్రహీం (స.హ.స.)కు చెబుతారు. దీంతో ఇబ్రహీం దుంబాను జుబాహ్ చేసి అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెబుతారు. దీన్ని 'ఖుర్బానీ' అని పిలుస్తారు. అప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ముస్లిం పై ఖుర్బానీ చేయడం విధిగా చేయడమైంది.

జంతువును మూడు భాగాలు చేయాలి

ఖుర్బానీ చేసే జంతువును మూడు భాగాలు చేయాలి. 52 తులాలు వెండి లేదా 7.5 తులాల బంగారు ఉన్న ప్రతి ముస్లిం విధిగా ఖుర్బానీ చేయాలి. ఖుర్బానీ చేసే జంతువును మూడు భాగాలు చేసి ఒక భాగం సొంతానికి, మరో భాగం పేదలకు, మూడో భాగం బంధువులకు పంచి పెట్టాలి. ఒక వ్యక్తి ఒక పూట తినే విధంగా ఖుర్బానీ మాంసం పేద ప్రజలకు పంపిణీ చేయాలని మత పెద్దలు ముస్లింలకు శుక్రవారం జరిగిన ప్రత్యేక బయాన్‌లో తెలిపారు. పేదల భాగంలో ముందుగా ఇరుగు పొరుగులో ఉన్న వారికి పంపిణీ చేయాలని వక్తలు తెలిపారు.

కనీసం ఒకసారి హజ్ చేయాలి



ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒకసారి హజ్ తప్పనిసరిగా చేయాలి. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో వెలసిన కాబాలో హజ్ చేయాలి. జిల్ హజ్ మాసంలో 9వ రోజు ఈ హజ్ జరుగుతుంది. ఆ రోజు ఉపవాసం ఉండి హజ్ చేస్తే చేసిన పాపాలన్ని తొలగిపోతాయని ముస్లింలు విశ్వసిస్తారు.

– ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, పీఠాధిపతి, దర్గా-ఏ-గఫారియా

అర్హత ఉండీ హజ్ చేయకపోతే..



అర్హత ఉన్న ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒకసారి హజ్ చేయాలి. అర్హత, ఆరోగ్యం ఉండి కూడా హజ్ చేయకపోతే అతడు అవిశ్వాసిగా మృతి చెందుతారు. ఖుర్బానీ చేసే జంతువును మూడు భాగాలు చేసి ఒక భాగం పేదలకు పంచి పెట్టాలి. ఒక మనిషి కనీసం ఒక పూట తినే విధంగా మాంసం పంచాలి. అపుడే పేదలు కూడా సంపన్నతులతో సమానంగా పండుగ జరుపుకొంటారు.

– షఫీవుల్లా, పేష్ ఇమాం, మస్జిద్-ఏ-ఖాదరియా, కమలాపురం

50 మంది తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ ఉచిత బీమా


మేస్త్రీలకు బీమా బాండ్లను అందిస్తున్న భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ నాగేంద్ర

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని సుచరిత ఎంటర్‌ప్రైజెస్‌లో శుక్రవారం భారతి సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది మేస్త్రీలకు ఒక లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్‌లను భారతి సిమెంట్ కంపెనీ జిల్లా టెక్నికల్ సీనియర్ ఇంజినీర్ నాగేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని తెలిపారు. ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ 5 గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందని తెలిపారు. ఈ సిమెంట్ చాలా దృఢత్వాన్ని కలిగి ఉంటుందని, కట్టడాలు త్వరగా పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సుచరిత ఎంటర్‌ప్రైజెస్ డీలర్ సుబ్బరామిరెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

– ముగ్గురు ఉపాధి కూలీలకు గాయాలు


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

వల్లూరు : మండల పరిధిలోని తోల్లగంగనపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఉపాధి హామీ కూలీలు గాయపడ్డారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెకు చెందిన 13 మంది ఉపాధి హామీ కూలీలు తోల్లగంగనపల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు చేయడానికి ఆటోలో బయలుదేరారు. తోల్లగంగనపల్లె సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు కింద పడ్డారు. ఈ ప్రమాదంలో నల్లపురెడ్డిపల్లెకు చెందిన ముంతా రాములమ్మ, ముంతా స్వాతి, బండెల కృపావతి అనే మహిళా కూలీలు గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో విజయ భాస్కర్, ఏపీవో సుధారాణి, ఉపాధి సిబ్బంది రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

కొత్త హంగులతో 'జోయ లుక్కాస్' షోరూం


ఆధునీకరించిన జోయ లుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప కల్చరల్ : ఇకపై ఆధునిక సరికొత్త హంగులతో జోయ లుక్కాస్ షోరూం జిల్లా వాసులకు అందుబాటులో ఉంటుందని కడప నగర మేయర్ కె.సురేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆధునీకరించిన జోయ లుక్కాస్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ఫేవరేట్ జ్యువెలరీని లక్షలాది డిజైన్లతో కూడిన కలెక్షన్లు, గొప్ప కస్టమర్ సర్వీసును మరోమారు ప్రజలకు అందించేందుకు జోయ లుక్కాస్ కొత్త హంగులతో సిద్ధమైందని తెలిపారు. పునఃప్రారంభ సందర్భంగా గోల్డ్, డైమండ్, ప్రెషస్, సిల్వర్ జ్యువెలరీలపై అన్ని మజూరి చార్జిలపై 50 శాతం తగ్గింపు జూలై 14వ తేదీ వరకు ఉంటుందన్నారు. జోయ్ లుక్కాస్, జోయ లుక్కాస్ గ్రూపు సంస్థల ఎండీ మాట్లాడుతూ ఈ షోరూంను అత్యంత ఆధునీకరించి పునఃప్రారంభిస్తూ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ షోరూం గతంలో కంటే అన్ని రకాల ఆధునిక బంగారు ఆభరణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అద్భుతమైన డిజైన్ శ్రేణి, సేవలు, నాణ్యత పట్ల తమ సంస్థ అంకిత భావంతో ఉందని, వినియోగదారులకు మెరుగైన షాపింగ్ అనుభవం లభించగలదని విశ్వసిస్తున్నామన్నారు. ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లను అందుకోవాలని నగర వాసులను ఆహ్వానించారు. అత్యుత్తమైన క్లాసిక్ ఆభరణాల నుంచి సమకాలీన డిజైన్ల వరకు విస్తృత శ్రేణి జ్యువెలరీని కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

బాలింత మృతిపై ఆస్పత్రి వద్ద ఆందోళన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఇన్‌సెట్) మృతి చెందిన మంజుల జ్యోతి

రాయచోటి టౌన్ : బాలింత మృతిపై బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వారు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మంజుల జ్యోతి (20)ని పులివెందులలోని గురుజాల గ్రామానికి చెందిన మంజుల మల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. ఆమె గర్భం దాల్చడంతో పుట్టింటి నుంచి రాయచోటికి వచ్చి శ్రీ వల్లీ అనే ప్రైవేటు హస్పిటల్‌లో వైద్యం చేయించుకొనేది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆ హస్పిటల్‌కు ఆమె బంధువులు తీసుకొచ్చారు. సాధారణ కాన్పు కాదని ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో అందుకు అంగీకరించారు. ఆపరేషన్ చేసి పాపను సురక్షతంగా బయటకు తీశారు. తరువాత రక్తస్రావం ఎక్కువ అవ్వడం జరిగింది. దీంతో ఆమెను కాపాడే ప్రయత్నంలో భాగంగా అక్కడి వైద్యులు.. రాయచోటి - మదనపల్లె రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శుక్రవారం ఉదయం వరకు వైద్యం చేశారు. అయితే వైద్యం వికటించిందో.. సకాలంలో అందలేదో, తెలియదు కానీ ఆమె ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి రూ.40 వేలు ఇస్తే కానీ ఇచ్చేది లేదని వైద్యులు చెప్పడంతో విషయం వివాదంగా మారింది. దీంతో వైద్యులకు, మృతురాలి బంధువులకు గొడవ మొదలయ్యింది. మీ నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని మృతురాలి బంధువులు గొడవకు దిగారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శిలాఫలకాలను పగలగొట్టినంత మాత్రాన

అభివృద్ధిని చెరిపెయ్యలేరు

- మేము చేసిన ప్రగతి కంటే ఎక్కువ చేసి చూపించండని సవాల్
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


చిట్వేలి రోడ్డు బ్రిడ్జి వద్ద పగలగొట్టిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : శిలాఫలకాలను పగలగొట్టినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన అభివృద్ధిని ఎవరూ చెరిపెయ్యలేరని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల ఫలితాల అనంతరం.. రైల్వేకోడూరులోని టోల్‌గేట్ వద్ద వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.40 లక్షల సొంత డబ్బులతో నిర్మించిన బస్టాండ్, అలాగే జగనన్న ప్రభుత్వం రూ.15 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తే అక్కడున్న శిలాఫలకాన్ని, 9 కోట్లతో చిట్వేలి రోడ్డులో నిర్మించిన బ్రిడ్జి వద్ద ఉన్న శిలాఫలకాన్ని టీడీపీ, జనసేనకు సంబంధించిన వారు ధ్వంసం చేశారు. ఆ ప్రాంతాలకు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 70 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ చేయని సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామన్నారు. తాము గత 20 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏ ఒక్కరికీ హాని చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల ముందే పార్టీలు తప్ప ఎన్నికల తరువాత ఏ రోజూ కూడా పార్టీల వ్యక్తులు అని అనుకోలేదన్నారు. ట్యాంపరింగ్ చేశారో, ఈవీఎంలు మార్చారో ఏదోక విధంగా అధికారం చేపట్టిన విషయం ఆ దేవుడికే తెలుసన్నారు. రైల్వేకోడూరులో మునుపెన్నడూ లేని విధంగా కొంత మంది కొత్త రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. ఇది మంచి సంస్కృతి కాదని, మీరు ఏదైనా చేయాలనుకుంటే మేము చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేసి చూపించాలని సవాల్ విసిరారు. ఇలా శిలాఫలకాలు పగలకొట్టడం, కార్యకర్తలపై దాడులు చేయడం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నియోజకవర్గంలోని ప్రజలందరికీ వైఎస్సార్ సీపీ, మేము అంతా ఒక రక్షణ కవచంలా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, కోడూరు, చిట్వేలి మండలాల కన్వీనర్లు సుధాకర్‌రాజు, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వైఎస్ అన్వర్‌బాషా, సిద్దయ్య, రామక్రిష్ణ, డమ్ము రఘు, డీసీ రమణ, నాగరాజా, రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, రెడ్డయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



వెంకటసుబ్బారెడ్డి (ఫైల్)

నిమ్మనపల్లె : బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్. వెంకటరెడ్డి కుమారుడు ఎస్.వెంకట సుబ్బారెడ్డి (41) వ్యవసాయం చేస్తూ జీవిస్తుండే వాడు. శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో గ్రామ సమీపంలోని అక్కగార్ల కుంట వద్ద ఉన్న గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గంమధ్యలో వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కనున్న సమాధిపై పడ్డాడు. ప్రమాదంలో శరీరంలోని ఓవైపు పక్కటెముకలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసర విభాగ వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలపై తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి వెళుతుండగా మార్గంమధ్యలోని సిటిఎం వద్ద పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుడి భార్య ఎస్. సంతోషి కుమారి తమకు పోలీస్ కేసు అవసరం లేదని, ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడం కారణంగా వెంకటసుబ్బారెడ్డి మృతి చెందాడని, మృతిపై తమకు అనుమానాలు అభ్యంతరాలు లేవంటూ పోలీసులకు రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు. కాగా మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం అవుట్ పోస్ట్ పోలీసులు నిమ్మనపల్లె పోలీసులకు తెలియజేశారు.

జంతువుల సంరక్షణ కోసం నోడల్ అధికారి నియామకం

కడప అర్బన్ : రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశాల మేరకు పశువులు, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు కడప జిల్లాకు నోడల్ అధికారిగా కడప దిశా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పని చేస్తున్న ఎస్.రమాకాంత్‌ను నియమించినట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా, చీఫ్ ఆఫీస్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఈ నియామకం చేపడుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఏదైనా సమాచారం వుంటే ఫోన్ నెంబర్: 91211 00535కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే కడప ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, పశుసంవర్ధక శాఖల అధికారులతో కూడిన 24/7 పని చేసేటట్లు కంట్రోల్ రూమ్ నంబర్ : 08562-294446కు తెలియజేయాలని ఆయన కోరారు.

బ్రహ్మంగారి కల్యాణ ఉభయదాతలకు ఆహ్వానం


సి.శంకరబాలాజి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని మద్విరాట్ శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంలో శాశ్వత ఉభయదాతలుగా పాల్గొనటకు అవకాశం కల్పిస్తున్నట్లు మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర బాలాజి తెలిపారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికలో ప్రతి నెల శుద్ధ ద్వాదశిన శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేడుకలో శాశ్వత ఉభయదాతలుగా పాల్గొనదలచిన వారు లక్ష రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. 21 ఏళ్ల పాటు ఏటా వారు కోరుకున్న నెలలో ఉభయదాతలుగా పాల్గొనవచ్చని తెలిపారు. అలాగే రూ.2,116 చెల్లించి పేరు నమోదు చేసుకుని కల్యాణంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. శాశ్వత, తాత్కాలిక ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు అందించి, శేషవస్త్రాలతో సన్మానం చేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు మఠంలో సంప్రదించాలని వివరించారు.

పాత కక్షలతో యువకుడిపై దాడి


గాయపడ్డ సురేంద్ర

పీలేరు రూరల్ : స్థానిక పాత బస్టాండ్‌లో యువకుడిపై దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పీలేరు పట్టణం యర్రమరెడ్డిగుట్టకు చెందిన కె.సురేంద్ర (29)పై స్థానిక కడప రోడ్డుకు చెందిన సాద్విక్ బుధవారం రాత్రి పాత బస్టాండ్‌లో ఇటుక రాయితో దాడి చేశాడు. ఏడాదన్నర క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగి పాతకక్షలు ఉన్నట్లు సమాచారం. తనపై జరిగిన దాడిపై సురేంద్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

- ఎవరో హత్య చేసి చెట్టుకు ఉరివేశారంటున్న కుటుంబ సభ్యులు
- 18 రోజులపాటు పోలీసులు గాలింపు చర్యలు


సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : అదృశ్యమైన వ్యక్తి అడవిలో చెట్టుకు శవమై వేలాడుతూ ప్రత్యక్షం అయిన సంఘటన లక్కిరెడ్డిపల్లి మండలం పాలెం గొల్లపల్లి పంచాయతీలోని బురుజుపల్లి సమీపంలో చోటు చేసుకుంది. చిన్నకొండు సుదర్శన్ (34) అనే వ్యక్తి 18 రోజుల నుంచి కనిపించడం లేదని పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి శేషాచలం అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టగా.. ఎట్టకేలకు శుక్రవారం మనమోతుల గుట్ట సమీపంలో చెట్టుకు వేలాడుతున్న సుదర్శన్ మృతదేహాన్ని అక్కడున్న గొర్రెల కాపరులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, మృతుడు సుదర్శన్ అని నిర్ధారించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మే నెలలో చిన్నకొండు సుదర్శన్ అదృశ్యం కాగా బురుజుపల్లి సమీపంలోని శేషాచల అడవుల్లోకి వేట కోసం వెళ్లాడని, ఆరోజు రాత్రి మరుసటి రోజు వరకు కుటుంబ సభ్యులు వేచి చూశారు. నాలుగు రోజులు గడిచినా ఇంటికి రాకపోవడంతో జూన్ 1వ తేదీన లక్కిరెడ్డిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు శేషాచల అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ఎన్నికలు ముగిసినప్పటి నుంచి కనిపించకపోవడంతో ఎవరో చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ వచ్చారు. వేటకు జతగా వెళ్లిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అయినప్పటికీ అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ అంతుచిక్కకపోవడంతో కుటుంబ సభ్యులకు మరింత అనుమానాలు ఎక్కువ అయ్యాయి. శరీరం మాత్రం 18 రోజులు అయినా చెట్టుకు అలాగే వేలాడుతుంది. 18 రోజుల ముందు తానే ఉరివేసుకుంటే శరీరంలో అవయవాలు, షర్టు అలాగే ఉండటం అసాధ్యమని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో చంపి అడవిలోకి తీసుకెళ్లి చెట్టుకు ఉరివేశారని వారు ఆరోపిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్ తన సిబ్బందితో రాత్రింబవళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా అంతు చిక్కకపోవడంతో పోలీసులు మరింతగా గాలింపు చర్యలు వేగం పెంచారు. శుక్రవారం పాలెం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొంత మంది గొర్రెల కాపరులు అడవిలో గొర్రెలు కాస్తుండగా.. మామిడి చెట్టువద్ద కొన్ని పక్షులు వాలి ఉండటంతో దగ్గరకు వెళ్లి పరిశీలించగా అదృశ్యమైన సుదర్శన్‌గా గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. మృతుడి భార్య శివమ్మ, కుమారుడు వంశీలు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరో చంపి ఇక్కడ ఉరివేశారా లేక తానే అడవికి వచ్చి ఉరివేసుకున్నాడా అన్న విషయం శనివారం పోస్టుమార్టం చేసిన తరువాత తేలనుందని ఎస్ఐ తెలిపారు. మృతదేహం మాత్రం ఉరివేసుకొని వేలాడుతుండగా, కాళ్లు మాత్రం కాలినట్లు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి


తీవ్రంగా గాయపడిన రవినాయక్

పెద్దమండ్యం : మండలంలోని దిగువపల్లె పంచాయతీ వడ్డివంకతండాకు చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రవినాయక్ (30)పై గురువారం రాత్రి దాడి జరిగింది. గాలివీడు-బండ్రేవు మార్గంలో తీవ్ర గాయలతో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి 108 ద్వారా తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గతంలో బండ్రేవు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన రవినాయక్ గ్రామంలో టీడీపీ మద్దతుదారుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దిగువపల్లె గ్రామ సర్పంచ్ భర్త యుగంధర్‌రెడ్డి, రవినాయక్‌ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. వీరు ఇద్దరు గ్రామంలో టీడీపీ మద్దతుదారులుగా ఉన్నారు. ఎన్నికల సమయంలో విభేదాలు పొడచూపడంతో మనసులో పెట్టుకున్న సర్పంచ్ భర్త వర్గీయులు, గాలివీడు నుంచి వడ్డివంకతండాకు వస్తున్న రవినాయక్‌పై దాడి చేసినట్లు అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108 ద్వారా తంబళ్లపల్లెకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఎస్ఐ రవి కుమార్ విచారణ చేశారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


కరీంబాషా మృతదేహం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. రంగారెడ్డి కాలనీ కొత్త ఇండ్లుకు చెందిన ఖాజాపీర్, గులాబ్ జాన్ దంపతుల మూడవ కుమారుడు ఎస్. కరీంబాషా (21) పట్టణంలోని లారీ బాడీ బిల్డింగ్ షాప్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల కొంతకాలంగా పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండే వాడు. ఇదే విషయమై శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు అతన్ని మందలించారు. సక్రమంగా పనులకు వెళ్లాలంటూ వారు కోప్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన కరీంబాషా రంగారెడ్డి కాలనీ సమీపంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అత్యవసర విభాగ వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలపై తిరుపతికి రెఫర్ చేశారు. ఆ మేరకు బాధితుడ్ని తిరుపతికి తరలించగా అక్కడ నుంచి తిరిగి బెంగళూరుకు తీసుకు వెళ్తుండగా, మార్గంమధ్యంలో పీలేరు వద్ద పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఖాజాపీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు.